ఆత్మీయుడైన తన మిత్రుడిగురించి అతడికి తెలిసిన నిజం ఏమిటి?

డా॥ గంటి శ్రీరామచంద్రమూర్తి కథ

# గుండెక్రింద తడి

అర్ధరాత్రి— ఎప్పటికీ రాని నిద్రకోసం ప్రార్థిస్తూ, ప్రయత్నిస్తూ అటూ ఇటూ పొర్లుతున్నాను— చుట్టూ ఆవరించిన నిశ్శబ్దం అప్పుడప్పుడు భయపెడ్తూ అంతలోనే ఆర్తిగా కావలించుకుని ఓదార్చే ప్రయత్నం చేస్తూంది. ఒంటరితనపు సముద్రంలో బెదురుగా రాత్రి తుపాన్ తాకిడికి తట్టుకోలేక బతుకువాన అల్లలాడుతూంది. ఉదయం అంగీకరిస్తూ లేచి లైట్ స్విచ్ వెలిగించి పుస్తకాల అరలోంచి సల్మన్‌రష్దీ "Midnight's Children" తీసి పుటలు తిరగేస్తూంటే వినిపించిందా శబ్దం.

"ఉష్" అని... ఆ వెనకే సన్నగా ఈలపాట.

అది నా పజిల్ ప్రవీణ్ సంకేతం. ఆంధ్రాలో తుపాన్‌లా వాడెప్పుడు దిగుతాడో తెలీదు. ఒక్క క్షణం తృప్తిగా అనిపించింది. మర్నాడు ఆదివారం. ఆదివారం ఒంటరిగా గడపాల్సిరావడం కన్నా నరకం లేదన్నది నా అనుభవం. లేచివెళ్ళి తలుపు తీశాను. ప్రవీణ్ వాడి వెనకాలే ఇద్దరు. సన్నగా పొడుగ్గా రిమ్‌లెస్ అద్దాలతో మొహాన చెరగని చిరునవ్వుతో వున్నాడతను— "డాక్టర్ చంద్ర".

పొట్టిగా లావుగా వున్నాడు మరొకతను "గిరీష్" ప్రవీణ్ పరిచయం చేశాడు.

మాటల్లో చెప్పాడు ప్రవీణ్. ముగ్గురూ పూనాలో జర్మన్ భాష నేర్చుకుంటున్నట్లు — "రోజూ పగలు లేచింది మొదలు రాత్రి పడుకోబోయే వరకూ జర్మన్ ... పిచ్చెక్కిపోయి విశ్రాంతికోసం నీ దగ్గరికి పరిగెత్తుకు వచ్చేశాం" అన్నాడు నవ్వుతూ. వాడు



ఇంజనీరింగ్ పూర్తిచేసి పై చదువులకి జర్మన్ వెళ్ళదల్చుకున్నాడు.

బొంబేలో పెద్దహోలు అద్దెకి దొరకడం.

అందరికీ పక్కవేసి బెడ్‌లైట్ కాంతిలో

రష్మీ ప్రపంచంలోకి వెడుతూంటే పలకరిం
చేదు చంద్ర ''అర్ధరాత్రి మిమ్మల్ని అనవస
రంగా డిస్టర్బ్ చేసేం— హోటల్‌లో దిగుదా
ం అంటే ప్రవీణ్ ఒప్పుకోలేదు''

"ఫరవాలేదు!"

"మీకు అభ్యంతరం లేకపోతే నేనో పుస్తకం తీసుకోనా?" సమాధానం కోసం చూడకుండానే లేచి నిలబడ్డాడతను.

కొంత మంది మొదటి పరిచయంలోనే యుగాల ఆత్మీయత, అనుబంధం వున్నట్లు అనర్గళంగా మాట్లాడగలరు. డాక్టర్ చంద్ర అదే కోవకి చెందినవాడు. నేను స్వతహాగా మితభాషిని అతి చనువు గిట్టదు నాకు. అయితే సంభాషణ తెలుగులో సాగడంవల్లనో (ఎన్ని యుగాలైనట్లుంది నా భాష విని) లేక సాహిత్యం మీద చర్చ రూపంలో కొనసాగడంవల్లనో దాదాపు గంటన్నర అవిరామంగా మాట్లాడుకున్నాం కన్యాశుల్కం నుండి కంఠాభరణంవరకు ఒడెల్లో నుండి కెట్టీకెర్లీ దాకా ఆరాధన నించి అమృతధార అమృతం కురిసిన రాత్రి దాటి మౌనరాగం వరకూ... ఓహ్ ఎన్నెన్ని కబుర్లు!

"అలా బయటికి వెళ్ళి మాట్లాడుకుందామా?"

అతనే సజెస్ట్ చేశాడు. నిశ్శబ్దంగా లేచి న్ని అనుసరించేను.

బయట వెన్నెల ధారగా కురుస్తూ భూమిని తమకంతో అల్లుకుపోయి వుంది. కాంపౌండ్‌లోని మల్లెపూల సౌరభాన్ని పిల్లగాలి అప్యాయంగా పంచి వెళ్ళిపోతూంటే వేపచెట్టు మీద పక్షిపిల్ల వులిక్కిపడి లేచి బిత్తరపోయి కువకువలాడుతూంటే తల్లి ఓదారుస్తూ నిశ్శబ్దాన్ని చీలుస్తూంది.

చక్కటి వాతావరణం. పైజామా జేబిలోంచి సిగరెట్ తీసి వెలిగించేను.

అప్పటివరకూ ప్రసన్నంగా మాట్లాడుతున్న చంద్ర మొహం అంతలోనే అప్రసన్నంగా మారిపోయింది.

"ఒక్క మాట చెప్పనా" సూటిగా నా వేపు చూశాడు.

అప్పటికే నాలో అసహనం కొద్దికొద్దిగా పేరుకుంటోంది. సంభాషణ ఎటువేపు వెళ్ళబోతూందో చూచాయగా అర్థమైంది.

ఆర్నెల్లక్రితం అనూషకి ప్రామిస్ చేశాను సిగరెట్ ముట్టుకోనని. నేను బొంబే ట్రైనింగ్‌కి వచ్చేముందు అమెరికాలోని బిజినెస్ మేగ్నెట్‌కోసం నాకిచ్చిన ప్రమాణాన్ని— నా ప్రమాణాన్ని పసిఫిక్ సంద్రంలో కలిపేసి ఫ్లయిట్ ఎక్కేసిందా అమ్మాయి. చచ్చిపోయేందుకు ధైర్యంలేక జ్ఞాపకాల కొలిమిలో బ్రతకలేక హైదరాబాద్‌లో వుండలేక బొంబేలో స్థిరపడిపోయేను. అనూష తాలూకు జ్ఞాపకాలు చుట్టుముట్టి వుక్కిరిబిక్కిరి చేస్తూంటే సిగరెట్ వెలిగించి గతాన్ని వూదేసే ప్రయత్నం చేస్తాను. అందుకే సిగరెట్ మానమని ఎవరైనా అడిగినా... అసలా వూహే భరించలేను. అనూష మీద కసితో తాగుతున్నానో...లేక అనూష స్థానంలో ఆ దురలవాటు భర్తీ చేశానో నాకు తెలీదు.

అతను ఎప్పటిలా సమాధానంకోసం చూడకుండానే అడిగేడు

"మీరీ అలవాటు మానుకోలేరా?"

విన్నగా నవ్వేను. "ఏం కేన్సర్ వస్తుందనా?" ఉలిక్కిపడ్డాడతను. నేను సంభాషణ కొనసాగించేను.

"నాకు తెలిసిన పదేళ్ళ అమ్మాయికి బ్లడ్ కేన్సర్... అలాగే ఏ అలవాటులేని మా

నాన్నగారికి మధుమేహమూ, రక్తపోటూ... నా మటుకు నాకు జీవితాన్ని ఎంజాయ్ చేయాలనుంటుంది. ప్రస్తుతం వరకు నాకు ఏ కంప్లైయింట్ లేదు. ఆ మాటకొస్తే నాకంటే మీరే ఎక్కువ దగ్గుతున్నారు''

చివ్వుమని చూశాడతను. నేను పట్టించుకోలేదు.

''అందుకే ఈ జీవితానికి అర్థం లేదనిపిస్తూంటుంది. భరించలేని ఒంటరితనం అప్పుడప్పుడు కమ్మేస్తుంది. అప్పుడే... అందుకే ఈ సిగరెట్...''

అతను క్షణం నిశ్శబ్దంగా వుండిపోయేడు తరువాత అన్నాడు.


''వృత్తిరీత్యా నేను చాలా మంది అభాగ్యుల్నీ, దురదృష్టవంతులని చూడాల్సి వస్తుంది. ఎందుకు? ఏమిటి? అనే ప్రశ్నంకి జవాబు ఎప్పటికీ లభించదు. నువ్వు ఫిలాసఫీ స్టూడెంట్వి... నీకు వేరే చెప్పేదేముంది''.

కాసేపు చెప్పడం ఆపేడు. ఆ కొద్ది సమయంలోనే ఆ మసక వెలుతుర్లో కూడా స్పష్టంగా కనిపించింది అతని కంటికి అడ్డుపడిన నీటితెర'' మా నాన్నగారికి హార్ట్ అటాక్ వచ్చినప్పుడు నేను పక్కనేవున్నాను. ఆయన చెయిన్‌స్మోకర్. ఆయన అవస్థ చూడలేకపోయేను. అదృష్టవశాత్తు ఆయన కోలుకున్నారు.

ఈసారి నవ్వేశాడు ''సారీ... సాధారణంగా నేను అపరిచితులతో ఎక్కువ మాట్లాడను. ఏకవచనం కూడా ప్రయోగించను. కాని నిన్ను చూస్తుంటే ఏదో తెలీని ఆత్మీయత కలుగుతూంది. ఎప్పుడో తెగిన బంధం గుర్తుకువస్తుంది ఎక్కడో పోగొట్టుకున్న స్నేహితుడివనిపిస్తుంది. అందుకే ఇంతసేపు మాట్లాడాను.

అతను లేచి నిలబడ్డాడు ''పూర్వకాలం గృహస్థులు అతిథి సత్కారం చేసి వారు వెళ్ళిపోతూంటే వారికివ్వవలసింది ఇచ్చేవారుట...

నాకర్థమైపోయింది ఇంతసేపు రంధి అంతా నా సిగరెట్ గురించేనని... బలవం



తాన మొహాన నవ్వు పులుముకుని చిరాకు అణుచుకుంటూ అన్నాను.

"అలాటప్పుడు మనం అపరిచితులుగానే మిగిలిపోదాం... ఒక్కపూట పరిచయానికి అలవాటు సృష్టిచెప్పే అవసరం, అలవాటు నాకు లేవు" అతని మొహం వివర్ణమైపోయింది.

ఇసుకలో పడ్డ చేప పిల్లలా గిలగిల్లాడుతూ మర్నాడు నేను లేచేసరికి అతను లేడు. క్షణంలో సగంసేపు అపరాధం చేసిన భావం అంతలోనే నిర్లక్ష్యంగా నవ్వుకుని బయటికి వెళ్ళిపోయేను. ఆ సాయంత్రం ప్రవీణ్ ఒక్కడే వచ్చేడు. మర్యాద కాదని తెలిసి కూడా నేను మిగిలిన ఇద్దరి గురించి అడగలేదు.

* * *

రెండేళ్ళు గడిచిపోయేయి. ప్రవీణ్ పెళ్ళికి హైదరాబాద్ బయల్దేరాను. అక్కడ ప్రవీణ్ స్నేహితుడు గిరీష్ కనిపిస్తే గుర్తుపట్టి పలకరించేను. ఐదు నిముషాలు మాట్లాడిన తరువాత చంద్రని గురించి అడిగేను. రెండేళ్ళలో చాలాసార్లే గుర్తువచ్చేడతను నాకు. ప్రత్యేకించి సిగరెట్ వెలిగిస్తున్నప్పుడు.

"మీ సెంటి "మెంటల్" డాక్టర్ ఏం చేస్తున్నాడు?

పెళ్ళికి రాలేదేం?" మెంటల్ అన్న పదం వొత్తి పలికుతూ అడిగేను.

ఉండేలు దెబ్బతిన్న పిచ్చుకలా మారిపోయింది గిరీష్ మొహం...

'మీకు తెలీదా... ప్రవీణ్ ఉత్తరం కూడా రాయలేదా?'

'ఏమిటి?'

"మీ దగ్గర్నించి వచ్చిన నెల తరువాత అతను చనిపోయేడు. నేను నిర్ఘాంతపోయేను,

"ఆక్సిడెంటా?"

"వుహూ" తల అడ్డంగా వూపేడు "లంగ్ కేన్సర్"

"వ్వాట్... కాని అతను సిగరెట్ కాల్చడు కదా!" మొహం ముందు తెరలు తెరలుగా దగ్గుతున్న అతని రూపం గుండెలని మెలిపెడ్తూంటే మాట బరువై పెదవి విచ్చుకోవడం లేదు.

"మీ దగ్గరికి వచ్చినప్పుడు టాటా మెమోరియల్‌లో చెక్ చేయించుకున్నాడు. అప్పటికే సెకండరీస్ బ్రెయిన్‌లో స్థిరపడ్డాయి"... ప్రవీణ్ చెప్పి వుంటాడనుకున్నాను

"ఒక్క నిముషం... నా మాటకి అడ్డుపడ్తూ అన్నాడు గిరీష్ "మా ఇల్లు ఈ పక్క వీధిలోనే వుంది. మీ పేర్న ఒక లెటర్ ఇచ్చేడు చంద్ర... "మీ అడ్రెస్ తెలీక అది నా దగ్గిరే వుంచుకున్నాను... అతని చివరికోరికగా మీరా వుత్తరం..."

నాకు మిగిలిన మాటలేవీ వినిపించడంలేదు. గుండె బరువెక్కి, మెదడు శూన్యమై చెవుల్లో సన్నటి హోరు... ఎక్కడి బంధమోయ్ ఇది?"

కంట్లోని నీటి చుక్క మాత్రం కంటి అంచులదగ్గరే ఆగిపోయింది.

నిముషమాత్రం వుండే పారిజాత పరిమళం మనస్సుని చుట్టుముట్టేసి జీవితకాలం గుర్తుండిపోతుంది. కొంతమంది వ్యక్తుల పరిచయం కూడా అంతే

నా చేతుల్లోని సిగరెట్ నిశ్శబ్దంగా కిందకి జారిపడింది.